# విముక్తి

వెంకటరమణా విలాస్‌లో కాఫీ త్రాగి సిగరెట్ పీల్చుతూ బయటకువచ్చాడు ముకుందరావు. సాయంత్రంకావటంతో మెయిను బజారు జనంతో రద్దీగా ఉంది. రోడ్డుకు రెండు వైపులా ఉన్న షాపులు దీపాలంకరణ పూర్తిజేసుకొని, వింతకాంతులు వెదజల్లు తున్నాయి. సైకిలు నడిపించుకొంటూ అరుణా స్వీటు స్టాలుకు దారితీశాడు.

ముకుందరావు పి.డబ్ల్యు.డి. ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య అరుణ అదే ఊళ్ళో ఎలిమెంటరీ స్కూలు టీచరుగా ఉంది. ముకుందరావుకు రెండు నెలల క్రితమే ఈ ఊరుకు ట్రాన్సఫరు వచ్చింది. భార్య భర్తలు ఉద్యోగస్థులయితే ఒకే ఊర్లో వేయాలి అనే జీ. వో సంపాదించి భార్యను కూడా ట్రాన్సఫరు చేయించుకున్నాడు.

ముకుందరావు స్వీట్లు పాక్ చేయించి సంచిలో పెట్టుకొని ఇటు తిరిగేసరికి వెనుకనుంచి ఎవరిదోచేయి భుజంమీద పడింది.

"హల్లో ముకుందం....ఎన్నాళ్ళకు దర్శనం'' ఉలిక్కిపడి ప్రక్కకు చూశాడు ముకుందరావు. ప్రక్కనే స్కూటరుమీద కూర్చొని కాలు క్రింద ఆనించి ఉన్న రాజారావు కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ ముకుందరావుని చూసి నవ్వాడు.

"అరె....రాజారావ్ నువ్వా!.... పదేళ్ళ క్రిందట చూశాను ఇప్పుడెక్కడ?" ఆప్యాయంగా అడిగాడు ముకుందరావు.

"ఎక్కడేమిటి? ఇక్కడ స్టేట్ బాంకులో అడ్మినిస్ట్రేటివ్ అఫీసర్‌గా ఉంటున్నా. ఇంతకీ నీవిషయం చెప్పు. చెల్లెమ్మా,

పిల్లలూ బాగున్నారా! ఎక్కడ ఉంటున్నారు. ఏమిటిసంగతులు?" టకటకా అడిగాడు రాజారావు.

"మూలాపేటలో ఉంటున్నా, రెండు నెల్లనుంచీ. ఇక నీవిషయం చెప్పు. విమలా వాళ్ళు ఎలా ఉన్నారు" పరామర్శిం చాడు ముకుందరావు. అవూళ్ళో తనవాళ్ళంటూ ఒకరున్నందుకు సంతోషంగా ఉంది.

"ఇంటికిరా! దగ్గరే అన్ని విషయాలు మాట్లాడుకొందాం" అంటూ ముకుందరావును బయలుదేరతీసి, తను సైకిలు స్పీడుకు అనుగుణంగా స్కూటరు నడపసాగాడు రాజారావు.

రాజారావు పిన్నమ్మ కూతుర్ని చేసుకొన్నాడు ముకుంద రావు. రాజారావు నాన్నగారు వ్యాపారంలో అందెవేసిన చేయి. బాగా సంపాదించాడు. డబ్బుంది కాబట్టి కొడుకును బాగా చది వించాడు. తరువాత అదే డబ్బుతో మంచి ఉద్యోగమూ వేయిం చాడు. అందుకే రాజారావు జీవితం వడ్డించిన విస్తరిఅయింది ప్రస్తుతం రాజారావు తండ్రి చనిపోయాడు. తల్లి మాత్రమే ఉంది.

రాజారావు భార్య "అన్నయ్యా" అంటూ ఆప్యాయంగా పల కరించి చాలా మర్యాద చేసింది ముకుందరావుని. రాజారావు తల్లి కూడా ఎంతో అభిమానంగా మాట్లాడింది. రోజూ ఉదయాన్నే డ్యూటీకివెళ్ళి, సాయంత్రానికి తిరిగి వస్తూ రొటీన్ లైఫ్ గడుపు తున్న ముకుందరావుకి ఇది మంచి రిలీఫ్ అయ్యింది.

రోజులు గడిచిపోతున్నాయి. ఇప్పుడు సెలవు వస్తే రాజా రావు కుటుంబం ముకుందరావు ఇంటికి రావడమో, ముకుంద రావు కుటుంబం రాజారావు ఇంటికిపోవడమో జరుగుతూ ఉంది. బంధుత్వంలోఉన్న అనుభూతిని ఇరువైపులవారు అనుభవిస్తున్నారు.

ఓ ఆదివారం ముకుందరావు కుటుంబం రాజారావు ఇంట్లో కూర్చొని పిచ్చాపాటి మాటాడుకుంటున్నారు. ఇంతలో రాజారావు ఉన్నట్లుండి,

"ఒరేయ్ ముకుందం! మేము సౌత్ ఇండియా టూరు వెళ్దామనుకొంటున్నాము. మీరూ వస్తారా" అన్నాడు.

ముకుందరావుకు తెలుసు. రాజారావు లక్షాధికారి బిడ్డ ఇటువంటి టూర్లు ఎన్నయినా వేయగలడు. ఎంతయినా ఖర్చుపెట్టగలడు. తనకా స్తోమతు చాలదు. మొహమాటానికి పోతే తిప్పలు పడవలసి వస్తుంది.

"రాజారావ్! నేనీమధ్య ఉన్న సెలవంతా వాడేసానోయ్. మరేం అనుకోకు. ఈసారికి ప్రయత్నిస్తాలే" అన్నాడు ముకుందరావు బాగా ఆలోచించుకొని.

"అవునన్నయ్యా మాది సింగిలు టీచరు స్కూలు కాబట్టి సెలవు దొరకడం చాలకష్టం" అరుణ అంది.

"మీరు వస్తే బాగుంటుంది వదినా" విమల అందుకొంది.

"సరే అనవయ్యా ముకుందయ్యా! అందరం సరదాగా తిరిగొస్తాం" అంది రాజారావు తల్లి.

ముకుందరావు ఏం మాట్లాడలేదు. రాజారావు ఏదో ఆలోచనలోపడిపోయినట్లు కళ్ళుమూసుకొని కుర్చీలోవెనక్కు వాలాడు. "సరే, ముకుందరావ్ నీఇష్టం" ఓ అయిదు నిముషాల తర్వాత అన్నాడు. తేలిగ్గా గాలి పీల్చుకున్నాడు ముకుందరావు.

"నాకో సహాయంచెయ్ ముకుందరావ్, ఎలాగూ రానంటివి. మాఇంట్లొ ఇనప్పెట్టె ఉంది. మేంవచ్చేంతవరకూ కాస్త మీఇంట్లో ఉంచాలోయ్"

"దానికేం భాగ్యం అలాగే ఉంచుకొంటాం" అని నాలుక్కరచుకొని, "అరెరె....ఇనప్పెట్టా! .... దాంట్లో విలువయిన వస్తువు

లుంటాయి. అలాంటివి మా ఇంట్లో వద్దు. సారీరా! ...." అన్నాడు ముకుందరావు గాభరాగా.

అతని గాభరాకు అందరూ నవ్వారు. ఒక్క ముకుందరావు భార్య తప్ప. ఆమెకు తెలుసు ఇటువంటి బాధ్యతలు పైన వేసు కొన్నందువల్ల కలిగే చిక్కులు

రాజారావు నవ్వుతూ, "గాభరాపడకురా! అందులో విలువైన వస్తువులేం లేవు. పేరుకు ఇనప్పెట్టె మాత్రమే. ఏవయినా పోతే నిన్నడగన్లే" అన్నాడు. అందరూ నవ్వారు. ఇక వాదించడం బాగుండదని, "నాకిప్పుడు భయం తీరిపోయిందోయ్. నీ ఇష్ట ప్రకారమే మా ఇంట్లో ఉంచు" తేలిగ్గా నవ్వేస్తూ అన్నాడు ముకుందరావు.

రెండు రోజుల తరువాత ఓఉదయం ఇనప్పెట్టెను తన ఆఫీసు జీపులో పెట్టుకొని వచ్చి ముకుందరావు ఇంట్లో చేర్చాడు రాజారావు. ఆరోజు సాయంత్రం మద్రాసుకు కారులో బయలుదేరి వెల్తూంటే తనకుటుంబ సభ్యులతో వీడ్కోలిచ్చాడు ముకుందరావు.

ఆరాత్రి భోజనాలుచేసి నిద్రకుపక్రమిస్తూండగా అసలు విషయం రహస్యంగా ముకుందరావు చెవిలో చెప్పింది అతని భార్య అరుణ. అటంబాంబు పేలినట్లయి గుండె వరకూ కప్పు కొన్న దుప్పటిని కాళ్ళవరకు లాగిపారేసి మంచం మధ్యలో పద్మాసనం వేసి కూర్చున్నాడు ముకుందరావు.

"ఏమిటి అరుణా నీవు చెప్పేది"

"అవునండీ! అందులో నూరు తులాల బంగారమూ, యాభై తులాల వెండి సామాను, ఓ పాతికవేల రూపాయల డబ్బూ ఉందట. అందుకే ఇంట్లో ఉంచి వెళ్ళడానికి భయపడి, ఎవరింట్లో ఉంచనూ నమ్మకం లేక మన ఇంట్లో ఉంచారట. నిన్న కారు బయలుదేరే ముందు రహస్యంగా నాతో చెప్పింది విమల"

ముకుందరావుకు భూమ్యాకాశాలు అతుక్కుపోయినట్లు అని పించింది. తనింట్లో ఓ వెయ్యిరూపాయలుంచుకోవాలన్నా భయమే. నాగరికత ఎంత అభివృద్ధి చెందుతుందో, అంతకంటె ఎక్కువ మోసాలు, దొంగతనాలు, జరుగుతున్నాయి. నిన్నగాక మొన్న ప్రక్కింటి రంగనాయకమ్మ బయటపడుకొని ఉంటే అర్ధరాత్రి దొంగ ఆమె మంచం మీద కాలుపెట్టి, నోట్లో గుడ్డలుకుక్కి రెండు సవర్లు బంగారు గొలుసు లాక్కుపోయాడు. ఆ వీధిలో రోజు కొక దొంగతనం చిన్నదో, పెద్దదో జరిగిందని వింటూనే ఉన్నాడు.

మూల ఉంచిన ఇనప్పెట్టె అతని కంటికి పాముల పుట్టలా కనిపించింది. ముకుందరావు ఇంటి వెనుక చాల ఖాళీస్థలముంది. చిన్న చిన్న పిచ్చి మొక్కలతో, తుమ్మచెట్లతో ఆస్థలం నిర్జనంగా ఉంటుంది.

ముకుందరావు వడివడిగా లేచి అన్ని గదుల తలుపులు పరీక్షచేసి వచ్చి, తన బెడ్‌రూము వెనుక కిటికీ తెరిచాడు. చీకట్లో పిచ్చిమొక్కలు తలలూపుతూ పిలుస్తున్నాయి. తుమ్మచెట్లు చీకటి దుప్పటి కప్పుకొన్న పిశాచాల్లా ఉన్నాయి. జాగ్రత్తగా కిటికీ తలు పులు వేసి అరుణను రమ్మన్నట్లు సైగచేశాడు.

ఇద్దరూ కలిసి ఇనప్పెట్టెను తాము పడుకొనే మంచంక్రింద అడ్డంగా పెట్టారు. దానిమీద ఇంట్లోవున్న చింకి చాపలూ, పాత గుడ్డలూ అన్ని వేసి కనిపించకుండా కప్పేసారు ముకుందరావు పడుకొన్నాడేగాని నిద్రరాలేదు. పిల్లలిద్దరూ గాఢంగా నిద్రపోతు న్నారు భార్యకుకూడా నిద్రపట్టింది. అతనికి లేనిపోని బాధ్యతలు తీసుకొన్నందుకు చుట్ట చుట్టుకొన్న త్రాచుపాము మీద తలపెట్టి పడుకొన్నట్లుంది. ఇక నిద్రెలా వస్తుంది? రాజారావు టూరు నెల రోజులు అన్నాడు. అంటే నెల రోజులు దీన్నికాపాడాలి. తనింట్లో ఇనప్పెట్టిపెట్టడం వీధిలోని వారంతా చూసారు. కనుక జాగ్రత్తగా ఉండాలి అనుకొన్నాడు.

ఆ ఒక్కరాత్రి నిద్రలేనందుకే అతనిముఖం వారంరోజులు తిండి లేనట్లు పీక్కుపోయింది. ఇంట్లో భార్యకు, పిల్లలకు దాని జాగ్రత్తను గురించి అన్ని హెచ్చరికలూ చేసాడు. రోజులు గడుస్తున్నాయి. రోజు రోజుకూ ముకుందరావుకు భయం ఎక్కువవుతూ ఉంది. మనిషి నీరసించిపోయాడు. భర్త పరిస్థితి చూసింతర్వాత ఇనప్పెట్టె కంటే తన భర్త ఏమవుతాడో అనే భయం పట్టుకొంది అరుణకు

"ఏవోయ్ ముకుందం ఏదయినా జబ్బులో పడ్డావా"? ఓ ఫ్రెండ్ అడిగాడు.

"అదేం లేదు బ్రదర్"

"లేదంటావేమిటోయ్! ముఖం పీక్కుపోయింది. కళ్ళు ఎక్కడో ఉన్నాయి. నువ్వు చెప్పకపోయినా అర్థమవుతూ ఉంది. ఏదో సమ్‌థింగ్ జరుగుంటుందని" పరీక్షగా చూస్తూ అడిగాడా మిత్రుడు.

"ఈమధ్య పనులెక్కువయ్యాయిలే. మరి నేనిక వస్తా"

"ఎక్కడికి వెల్తావ్! రోజూ రాత్రి తొమ్మిది గంటల దాకా ట్రంకురోడ్డులో బాతాఖానీ వేస్తూ మమ్మల్ని నవ్వించేవాడివి. ఇప్పుడు పొద్దుకూకేసరికి ఇంటికివెళ్లాలంటున్నావ్. ఏమిటి కథ?"

"అయామ్ సారీ! అర్జంటు పని ఉంది. మళ్ళీవచ్చి చెబుతా" అంటూ మరోమాటకు అవకాశమీయకుండా సైకిలెక్కాడు ముకుందరావు.

ఇక ఆఫీసులోకూడా ముకుందరావుకు ఇలాంటి పరామర్శలే ఎదురవుతున్నాయి.

"ఏమిటి ముకుందం మనిషివి సన్నగాఅయ్యావు. ఆరోగ్యం సరిగా లేదా" కొలీగ్ పరామర్శ.

"ఏమిటండీ ముకుందరావు గారూ! ఎప్పుడూ ట్రిమ్‌గా ఉంటూ, డీసెంటు డ్రెస్ వేసేవాళ్ళు. ఆ మాసిన గడ్డమేమిటి? ఆ జుట్టు పెంచడమేమిటి?" స్నేహితుడి బాధ.

"నమస్కారం ముకుందరావు సాబ్! తమరు హప్పుడూ, హప్పుడూ రూపాయి అర్ధరూపాయి టీకి ఇచ్చేవాళ్ళు. ఈమధ్య హేమిటో హేమిటో ఆలోచిస్తాఉండార్" ప్యూను పీరుసాహెబు ఆవేదన.

"ముకుందరావుగారూ! మీఆరోగ్య పరిస్థితిఏమిటో మాకర్థం కావడంలేదు. రోజురోజుకూ పరధ్యానం ఎక్కువయిపోతూ ఉంది. కాగితం వ్రాస్తే అందులో ఒక్క సెంటెన్సూ కంటిన్యుటీ లేదు. నా ఉద్దేశ్యమేమిటంటే, ఇట్ ఈజ్ బెటర్ టు అప్లై లీవ్. మీ-ఆరోగ్యం సరైన తర్వాతనే డ్యూటీలో చేరవచ్చు. ఆరోగ్యమేమహా భాగ్యమన్నారు పెద్దలు. ఆలోచించుకోండి" అన్నాడు ఆఫీసరు ఒకరోజు.

రాజారావు రావడానికి ఇక వారం రోజులే ఉంది. ఒకవేళ సెలవుపెట్టినా బాగుంటుందేమో ఈ వారం రోజులు. ఈ ఆలోచన రాగానే ఆరాత్రి భార్యతో మాట్లాడి సెలవుపెట్టడానికే నిర్ణయించుకొన్నాడు ముకుందరావు. అరుణ పరిస్థితికూడ అలాగే ఉంది. మనిషి చాల తగ్గిపోయింది. మునుపటిలా హుషారుగా ఉండడం లేదు. అయినా ముకుందరావులా స్పర్శజ్ఞానం కోల్పోలేదు.

లీవు అప్లయి చేసినప్పటి నుంచీ ముకుందరావు పగలూ, రాత్రి ఇంట్లోనే గడిపేస్తున్నాడు. పెరిగినగడ్డంతో, తైలసంస్కారం లేని జుట్టుతో దాదాపు పిచ్చివాడయ్యాడు. అతని మెదడులోంచి పాములవుట్ట ఇనస్పెక్టర్ బయటకు పోతేనేగాని విశ్రాంతి ఉండదు. తెల్లవారే రాజారావు టూర్ నుంచి తిరిగి వచ్చే రోజు.

ఆరోజు సాయంత్రం మార్కెట్‌లో భార్య ఇచ్చిన పట్టీలో కూరగాయలన్నీ కొని రోడ్డునపడి వస్తున్నాడు ఇంతలో ఎవరో పిలిచినట్లనిపిస్తే ఆగాడు.

ఎదురుగా తన కొలిగ్ నారాయణ. ''ఏం ముకుందం తిరుపతికి వెళ్తున్నావా! గడ్డం పెంచేశావ్. ఫామిలీతోనా, సింగిల్‌గానా! నీ నెరవేరిన కోరికేమిటో నాకూ చెప్పవోయ్" టకటకా అడిగాడు.

"అవునోయ్! తిరుపతికే మ్రొక్కుబడి ఉంది వెళ్ళాలి" ఇక అంతకంటె జవాబు దొరకక్క అన్నాడు ముకుందరావు

"ఓహెూ! అలాగా! సైకిలేదోయ్ నడిచేవస్తున్నావ్"అన్నాడు.

ముకుందరావుకు ఒక్కక్షణం తల తిరిగింది "అరెరె! సైకిలు మార్కెట్‌లోపెట్టి మర్చిపోయివచ్చాను. వస్తా" అన్నాడు వెనక్కు తిరిగి దూసుకుపోతూ.

"ఓరి నీమతి మరుపు మండా, ఇంకెక్కడుంటుంది సైకిలు. అందులోనూ ఈఊర్లో. నామాట విని ముందువెళ్ళి పోలీసు రిపోర్టియ్యి" అన్నాడు నారాయణ.

'నెరవేరిన కోరికేమిట్రా అంటే చెప్పకుండానే వెళ్ళాడు. కొంపదీసి వీడికి ప్రమోషను రాలేదుగదా!' ఈర్ష్యగాఅనుకొన్నాడు నారాయణ.

ముకుందరావు నేరుగా మార్కెట్‌దగ్గరకు వెళ్ళాడు. సైకిలు అక్కడే ఉన్నందుకు చాల సంతోషించాడు. ఆ రాత్రంతా దైవ ప్రార్థనతో గడిపాడు.

నిద్రలేస్తూనే, "అరుణా త్వరగా కాఫీ ఇవ్వు. రాత్రే రాజారావు వాళ్ళువచ్చి ఉంటారు. ఈరోజుతో ఆపీడ వదిలించుకొందాం" అన్నాడు ఆనందంగా. ఆమెకూ ఆనందంగా ఉంది. వెంటనే కాఫీ తెచ్చిచ్చింది.

ముకుందరావు వెళ్ళేసరికి రాజారావు ఇల్లంతా సందడిగా ఉంది. యథావిధి ఇతనికి సత్కారాలు జరిగాయి. యాత్రా విశే షాలడిగాడు. చెప్పారు. ముకుందరావుని తగ్గిపోయావేమిటనిగాని, గడ్డం ఎందుకు పెంచావని గాని వాళ్ళడగలేదు. ముకుందరావు అసలు విషయానికి వచ్చి ఇనప్పెట్టె తీసుకెళ్ళమని అడిగాడు.

"ఓస్ అదా!....తొందరేముంది. తీసుకెళ్తాంలే" అన్నారు.

ముకుందరావు గుండెలో రాయి పడింది. ఇంకేం అనలేక వచ్చేశాడు. తీసుకెళ్ళమని రోజూ అడుగుతూనే ఉన్నాడు. రేపు రేపు అని వాయిదా వేస్తూనే ఉన్నాడు రాజారావు. ఇంకో వారం రోజులు గడిచిపోయాయి

లీవు అయిపోతే ఇంకోవారం ఎక్స్టెండ్‌చేసివస్తున్న ముకుంద రావుని "బాగున్నవా" అంటూ పలకరించాడు ఒక నూతన వ్యక్తి.

"ఎవరు మీరు"

"నన్ను గుర్తుపట్టలేదా ముకుందరావ్! కాలేజీలో నీ క్లాసు మేటుని, హాస్టలులో నీ రూమ్‌మేటుని, ఒకప్పుడు అప్తమిత్రులం"

"ఒరేయ్ విశ్వం" కౌగిలించుకొన్నాడు మిత్రుడ్ని.

విశ్వం తను వ్యాపారం చేస్తూ ఈ వూళ్ళోనే ఉంటున్నట్లు చెప్పాడు. ఇంతకాలం ఎవరికీ చెప్పని ముకుందరావు, తన కడుపు లోని బాధనంతా స్నేహితుని ముందు వెళ్ళగక్కి విమోచన మార్గం చెప్పమని బ్రతిమాలాడు.

విశ్వం ముఖం సీరియస్ అయ్యింది. "వాడు నిజానికి ఏ టూరూ వెళ్ళలేదు. మీరు వీడ్కోలిచ్చిన రోజే మద్రాను వెళ్ళి రెండు రోజుల తర్వాత వచ్చి డ్యూటీలో జాయినయ్యుంటాడు. వాళ్ళు లేరనుకొన్నావు కాబట్టి నువ్వు వాళ్ళింటికి వెళ్ళలేదు. వాడు

టౌన్లోనే ఉంటూ నీకు కనిపించకుండా తప్పించుకొని తిరుగుతూంటాడు. వాడికి ఇనప్పెట్టెలోని సంపద ఒకసమస్య. అమ్మేస్తామన్నా, బాంకులో పెడదామన్నా తల్లి ఒప్పుకోదు. భార్య, భర్త వాళ్ళతోబాటు తల్లి జల్సాగా తిరగడానికి అలవాటుపడ్డారు. అటువంటప్పుడు ఇనప్పెట్టెనుకాపాడ్డం వాళ్ళకొక సమస్య. మనలాంటి బీదవాళ్ళకు అసలు ధనంలేకపోయినా అభిమానధనం ఎక్కువని, మాట నిలబెట్టుకోవడం కోసం ఎంతయినా శ్రమపడుతామని డబ్బున్న మహారాజులకు బాగతెలుసు. అందుకేనీలాంటి, నాలాంటి అమాయకుల్ని మోసంచేసి ఇలా అప్పజెప్పి హాయిగా ఉంటారు" అన్నాడు.

"ఇలా ఎంతకాలం?" అడిగాడు ముకుందరావు.

"ఎంతకాలమయినా సరే! నీదగ్గరనుంచి ఇనప్పెట్టె తీసుకోడు. కనుక నువ్వే రేపు తీసుకెళ్ళి వాడిది వాడికి అప్పజెప్పు"

"ఇవన్నీనీకెలా తెలుసు" అడిగాడు ముకుందరావు ఆశ్చర్యంగా.

"నేనూ నీలాగే ఒకప్పుడు ఇనప్పెట్టె బాధితుడ్ని. దాన్ని వదిలించుకొనేసరికి చావుతప్పి కన్ను లొట్టబోయి నట్లయింది"

స్నేహితుడు విశ్వం మాటలు శిరసావహించి మరురోజు ఓ పదిహేను రూపాయలు ఖర్చుపెట్టి ఆటోలో తీసుకెళ్ళి ఇనప్పెట్టె వాళ్ళకు అప్పజెప్పాడు. అందరూ ఇంట్లోనే ఉన్నారు. అందరూ ముఖాలు చిట్లించుకొన్నారు. ముకుందరావుతో ఎవ్వరూ మాట్లాడలేదు. దానికి బాధపడలేదు, సరికదా తనకా అవస్థ తప్పినందుకు ఎంతో సంతోషించాడు ముకుందరావు.

ఆరోజు నుంచి ముకుందరావు ఇంటికి, రాజరావు ఇంటికీ, రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. రాజారావును ఇప్పుడు

ముకుందరావు పలుకరించబోయినా ముఖం చిట్లించి తప్పించుకొని వెళ్ళిపోతున్నాడు.

ఇప్పుడు,

ముకుందరావు ట్రిమ్‌గా డ్రస్ చేసుకొని ఆనందంగా ఉంటూంటే,

ప్రస్తుతం,

రాజారావు ఇంకో మానధనుడివేటలో ఉన్నాడు.

★